చిట్టికథ

# అసమర్థుడి సణుగుడు

—వి. కృష్ణకుమారి



సమయం పన్నెండు కావొస్తోంది. పనులు ఆపేసి ఒక్కొక్కరూ లంచ్‌కి బయలుదేరుతున్నారు. శరత్ మైక్రో స్కోప్ స్విచ్ ఆఫ్ చేసి అలాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. చదువుతున్న రిసెర్చ్‌పేపరు ప్రక్కన పడేసి తలెత్తి చూసింది కవిత. "ఏం శరత్, లంచ్ టైమవుతోంది కదా, ఇంకా బయలుదేరలేదేం? ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నావు?" అడిగింది.

"ఆ ఏంలేదు. లైఫ్ చాలా బోర్ కొడుతోంది కవితా, ఎన్నాళ్ళు ఇలా రిసెర్చ్ చేస్తూ కూర్చోవటం. ఇది ఎప్పటికి పూర్తయ్యేను? ఎప్పటికి నేను సెటిల్ అవుతానో? ఇదే ఆలోచిస్తున్నాను."

"ఎప్పుడూ అదే ఆలోచనా? అఫ్‌కోర్స్ సహజమే ననుకో అయినా ఇందులో ఆలోచించడానికేముంది? నువ్వు పి.హెచ్.డి.పూర్తి చేయాలనుకుంటున్నావు. పూర్తి చేస్తావు. దానికి కొంత టైమ్ పడుతుంది కదా మరి. అన్నట్లు ఇది విన్నావా? మన గీత లేదూ, ఆంధ్రాయూనివర్శిటీలో రిసెర్చ్ చేస్తోందీ ఆమె. అప్పుడే అంటే కేవలం ఒక సంవత్సరంలోనే మూడు రిసెర్చ్ పేపర్స్ పబ్లిష్ చేసింది. నేను ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు తెలిసింది. రియల్లీ ఎప్రిషియబుల్ కదూ!"

"ఏడాదిలోనే త్రీ పేపర్స్? ఈజిట్? నేను 'టూ ఇయర్స్ నుండీ కొట్టుకుంటున్నాను. ఇంత వరకూ ఒక్క పేపర్ కూడా పబ్లిష్ చేయలేక పోయాను. ఇది ఎలా పాజిబుల్? అడిగాడు.

"దానిదేముంది? రెండు, రెండున్నర ఏళ్లలోనే థీసిస్ సబ్మిట్‌చేసి రికార్డు సృష్టించిన వాళ్ళులేరూ? కాని ఒకళ్లిద్దరు ఆమె గురించి—'ఆ ఏముందండీ, వాళ్ళగైడ్ థీసిస్‌లోనుంచీ, ఇంకో దాంట్లోనుంచీ, దీంట్లోనుంచీ చూసి వ్రాసి పేపర్స్ వేసిందని' చెప్పారు. కానీ నేను ఒప్పుకోను. ఎందుకంటే అసలు రిసెర్చ్ అంటేనే ఒక రకమైన 'కాపీయింగ్' అన్నారు ఈమధ్యనెవరో. అంతేకాదు మరి—ఇప్పుడు మనం మన సీనియర్స్ అందరి థీసిస్‌లనీ రిఫర్ చేయడంలేదూ. ఇదీ అంతే. ఈమె ఒక్కతే కాపీ చేస్తోందనడానికే మాత్రం ఛాన్సెస్‌లేవు. అన్నట్లు ఆమెకు సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ రావొచ్చని అంటున్నారు. నువ్వుకూడా అప్లై చేసినట్లున్నావు కదూ?" అడిగింది.

"ఆ అవును. నాకు రాదు. పేపర్స్ లేవుగా. ఎనీహౌ షి ఈజ్ లక్కీ. ఆ యూనివర్సిటీలో పేపర్స్ పబ్లిష్ చేయడానికి అవకాశాలెక్కువ. మనకేమో చాలా తక్కువ ఫెసిలిటీస్ ఉన్నాయి. ఈ లిమిట్స్‌లోనే వర్క్ చేయాలంటే కష్టం. పైగా సరైన ఎరేంజ్‌మెంట్‌కూడా లేదిక్కడ." కొంచెం నిరాశగా అన్నాడు.

"అలా ఎందరుకనుకోవాలి నువ్వు? నీకూ ఇక్కడ టీచింగ్ ఎక్స్‌పీరియన్స్ ఉంది, పైగా రిసెర్చ్ ఎక్స్‌పీరియన్స్ ఉంది. ఈ రెండూ చూపెట్టి నువ్వు ఇంటర్వ్యూలలో నెగ్గగలవు. నువ్వు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కి అప్లై చేస్తావుగానీ సరిగ్గా ప్రిపేరవవు. లేదంటే నువ్వుకూడా నాతోపాటే ఆ ఇంటర్వ్యూకి వచ్చి ఉండేవాడివి కదూ! నువ్వు కనుక ఇంటర్వ్యూ అటెండ్ అయినట్లైతే తప్పకుండా నీకు జాబ్ ఇచ్చేవారు. కాని నువ్వు రిటెన్ టెస్ట్ పాసవలేదు. దిసీజ్ యువర్ ఫాల్ట్" ఆవేశంగా అంది కవిత.

"ఓహో, అయితే తమరు అటెండ్ అయ్యారు కాదా ఇంటర్వ్యూకి. ఏమాత్రం నెగ్గుతారో చూస్తాను. అయినా అక్కడ ఇంటర్వ్యూ బోర్డ్‌లోనో, లేదంటే పొలిటికల్‌గానో ఇన్ఫ్లుయెన్స్ ఉండాలి. అంతలేలిక అనుకున్నావా సెలెక్ట్ కావడం! అందుకే నేను రిటెన్ టెస్ట్‌కి సరిగ్గా ప్రిపేరవలేదు—'మన కెటూ రికమెండేషన్ లేదుకదా, ఎందుకీ పాట్లు' అని కబుర్లు చెప్పడం కాదు చేసి చూపించాలి" అన్నాడు.

"సరే మనలో మనకి పోట్లాటలెందుకుగాని, పద వెళదాం. నాకు బాగా ఆకలిగా ఉంది. మా బ్యాచ్ నా కోసం ఎదురు చూస్తుంటారు" అంటూ బయటికి నడిచింది.

కొన్ని రోజులుగడిచాయి. కవిత, రమ, అనంతరామన్ ముగ్గురూ సెలెక్ట్ అయ్యారు. "కంగ్రాచ్యులేషన్స్ ఎప్పుడు వెళ్ళబోతున్నారు డెహరాడూన్‌కి?" ముక్తసరిగా అడిగాడు శరత్ కవితని.

"ఇరవయ్యో తారీఖున బయలుదేరుతున్నాం. తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కి—ముగ్గురం కలిసే వెళుతున్నాం. రిజర్వేషన్‌కూడా అయ్యింది." చెప్పింది.

అనుకున్నట్లుగానే ఇరవైన కవితతో పాటు మిగిలిన ఇద్దరూ కూడా డెహరాడూన్ వెళ్ళిపోయారు. ఆమె వెళ్ళిపోయిన మరుసటిరోజు క్యాంటీన్‌లో టీ త్రాగుతూ "కవితకు పొలిటికల్ ఇన్ఫ్లుయెన్స్ ఉందోయ్. వాళ్ళనాన్న మహాఘటికుడు. మొత్తానికి ఎవర్నో పట్టుకున్నాడు. లేదంటే అంత తేలిగ్గా వస్తుందా ఈ జాబ్. ఏమైనా కొంచెం కూడా బయటికి తెలియవ్వకుండా అనుకున్నది సాధించింది." చెప్పాడు శరత్ తన కో—స్కాలర్ ఇళంగోవన్‌తో.

మరొక రెండున్నర సంవత్సరాలు గడిచాయి. "ఇది విన్నావా శరత్. మీ ఫ్రెండ్ కవిత లేదూ? ఆమె ఆస్ట్రేలియా వెళుతోందట సెమినార్ అటెండ్ చేయడానికి. ఆమెకు ఫారిన్ పబ్లికేషన్స్ కూడా ఉన్నాయటకదూ! ఇంకొక సంవత్సరంలో పి.హెచ్.డి ఇస్తారనుకుంటున్నారు ఆమెకి. అన్నాడు ఇళంగోవన్ శరత్‌తో.

"ఈ ఆడవాళ్ళు ఏదైనా చేయగలరోయ్. వాళ్ళకు కొన్ని మార్గాలుంటాయి. పైకి రావడానికి. అదీగాక కొన్ని విషయాల్లో వీళ్ళకి ప్రిఫరెన్స్ ఇస్తూంటారు. ప్రొఫెసర్స్‌కూడా" వెకిలిగా అన్నాడు శరత్.

"నీలాంటి వాళ్ళుండబట్టే ఈ దేశంలో స్త్రీలకు గౌరవం లేకుండా పోతోంది. ఇక దేవుడే రక్షించాలి నీలాంటి వాళ్లని అనుకొని మెదలకుండా వెళ్ళిపోయాడు ఇళంగోవన్. ☐